క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మకు అంబలి సమర్పణ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాల్కొండ హాల్‌లో వెలసిన కోటా సుంకులాపరమేశ్వరిదేవికి భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో అంబలి సమర్పించారు. ఇళ్ల వద్ద నుంచి మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అంబలిని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గురురాజ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

నంద్యాల(సిటీ): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని ఎస్.నీరజ ప్రతిభ చాటిందని గురురాజ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. విద్యార్థినిని మంగళవారం ఆయన అభినందించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఎలమంచి వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తమ విద్యార్థిని నీరజ సత్తా చాటి సిల్వర్ మెడల్ సాధించిందన్నారు.


నవధాన్యాలు సాగు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి

బనగానపల్లె రూరల్: రైతులు నవధాన్యాల పంటలను సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని యనకండ్లలో గ్రామానికి చెందిన రైతు జానకిరాముడు భూమిలో 30 రకాల నవధాన్యాల విత్తనాలతో ప్రిమాన్స్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రారెడ్డి మాట్లాడుతూ ఆకు కూరలు, కూరగాయాలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు తదితర పంటలను సాగు చేపడితే భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం నవధాన్యలను ఎకర పొలంలో ఏ విధంగా విత్తుకోవాలి, పంటలను ఎలా రక్షించుకోవాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ సలాం, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పశు గ్రాసానికి గిరాకీ



ట్రాక్టరులో పశు గ్రాసాన్ని తరలిస్తున్న దృశ్యం

దొర్నిపాడు:పశు గ్రాసానికి పశు పోషకుల నుంచి గిరాకీ బాగా పెరిగింది. ఎకర జొన్న చొప్ప రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలుకుతోంది. గతంలో జొన్న పంట కోత అనంతరం చొప్పను వాములుగా ఏర్పాటు చేసుకొని పశువులకు మేతగా వాడేవారు. ప్రస్తుతం యంత్రాలు అందుబాటులోకి రావడంతో చొప్పను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి కట్టలు కడుతోంది. దీంతో పశువులకు ఆ మేతను తినేందుకు సులభతరంగా ఉండటంతో డిమాండు పెరిగిందని రైతులు తెలుపుతున్నారు.

రైతుకు రొక్కం.. సాగుకు ఊతం

- రైతు కుటుంబాలకు అండగా నిలుస్తున్న 'వైఎస్సార్ రైతు భరోసా'
- నియోజకవర్గంలో 45,955 మందికి లబ్ధి
- రూ 9.86 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద మరో 997 మంది రైతుల ఖాతాల్లో జమ అయిన రూ.62.46 కోట్లు

వైఎస్సార్ రైతు భరోసా పథకం అన్నదాతల ఇంట ఆనందోత్సాహాలను నింపుతోంది. గతంలో పంట సాగు చేసే ముందు నుంచి వాటిని నూర్పిడి చేసేవరకు రైతులు వడ్డీ వ్యాపారులవైపు చూడాల్సి వచ్చేంది. ప్రస్తుతం ఆర్థిక సాయం కోసం ఏ ఒక్కరినీ ఆశ్రయించే పని లేకుండా ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. – ఆళ్లగడ్డ



సేద్యం చేస్తున్న రైతులు

'వైఎస్సార్ రైతు భరోసా' కింద నియోజకవర్గంలోని ఆరు మండాలల పరిధిలోని అర్హులైన 45,955 మంది రైతుల ఖాతాల్లో రూ.98625500 జమ చేయడం జరిగింది. అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కింద 997 మంది రైతుల ఖాతాల్లో రూ.62.46 కోట్లు జమ చేసింది. దీంతో రబీ పంటల కోతల సమయంలో రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ఆదుకుంటుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతల్లో సాయం

వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ఏటా మూడు విడతల్లో రూ.13,500 సాయాన్ని అందిస్తోంది. మొదటి విడతగా రూ.7,500, రెండో విడత రూ.4 వేలు, మిగిలిన రూ.2 వేలు చివరి సారిగా జమ చేస్తోంది. పీఎం కిసాన్ సాయం కింద భూ యజమానులకు మాత్రమే కేంద్రం మూడు విడతల్లో రూ 6వేల చొప్పున జమ చేస్తోంది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న, కౌలుదారులకు రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

అర్హులందరికీ మేలు జరిగేలా..

గతంలో 42,715 మంది రైతులు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందేవారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు ఈ పథకంలో లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం గట్టిగా సంకల్పించడంతో నియోజకవర్గంలో అదనంగా మరికొంత మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. ఏ ఒక్కరైతు కూడా ఇబ్బంది పడకూడదనేది ప్రభుత్వ ఉద్దేశం.

ఈ ఏడాది మూడోవిడత నియోజకవర్గంలో మండలాల వారిగా వైఎస్సార్ రైతుభరోసా లబ్దిదారులు

మండలం	లబ్దిదారులు	జమ అయిన మొత్తం
ఆళ్లగడ్డ	9977	20626000
ఉయ్యాలవాడ	5901	12556500
దొర్నిపాడు	4564	10199500
చాగలమర్రి	7147	15255000
రుద్రవరం	9541	21180500
శిరివెళ్ల	8825	18808000
మొత్తం	45,955	9,86,25,500

పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడింది



వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా వచ్చే పెట్టుబడి సాయం వరుసగా నాలుగేళ్ల మూడు విడతలు క్రమం తప్పకుండా నా బ్యాంకు ఖాతాలో జమ అయింది. పంట పెట్టుబడులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ఎంతగానో ఉపయోగపడింది.

–శ్రీను, రైతు,గోవిందిన్నె,దొర్నిపాడు మండలం

సీఎంకు రుణపడి ఉంటాం



పోయిన ఏడాది డిసెంబర్‌లో భాగ పరిష్కారాలకు సంబంధించి కొత్త పాస్‌బుక్ వచ్చింది. వెంటనే రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లి వైఎస్సార్ రైతు భరోసా సాయం కోసం అర్జీ పెట్టుకున్నా. రెండు నెలల్లోనే ఇప్పుడు నా ఖాతాలో రూ.7,500 వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ అయింది. ఇంత తొందరగా వస్తుందని నేను ఊహించలేదు. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– జయచంద్రారెడ్డి,ఎర్రగుడిదిన్నె,రుద్రవరం మండలం

సాగు చేసే ధైర్యం వచ్చింది



నేను ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.5 ఎకరాల్లో జొన్న పొంట సాగు చేశాను. పంట బాగా పెరుగుతున్న సమయంలో ఈదురు గాలులు రావడంతో పంట దెబ్బతినడంతో ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.11,016 నా ఖాతాలో జమ చేసింది. పంటల సాగుకు ముందస్తుగానే పెట్టుబడిని అందించడంతో పాటు నష్టపోతే పరిహారం అందుతుందని ధైర్యం వచ్చింది.

– నరసింహారెడ్డి, మద్దూరు

పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి ఏటా రైతు భరోసా కింద రూ .13,500 లభిస్తోంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని రైతులు మంచి దిగుబడులు సాధించాలి. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా నగదు జమ అయింది. వైఎస్సార్ రైతు భరోసా యాప్ ద్వారా స్టేటస్ చూసుకోవచ్చు.

– రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ

సామ్యవాద మూల పురుషుడు కార్ల్ మార్క్స్



కార్ల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): దాస్ క్యాపిటల్ గ్రంథ రచనతో కోట్లాది మంది విప్లవ కారులు, సామ్య వాదులు, మేధావుల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించి శాస్త్రీయ సామ్య వాదానికి మూల పురుషుడిగా కార్ల్ మార్క్స్ నిలిచారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం కార్ల్ మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకుని నాయకులు మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పెట్టుబడి దారి వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతూ మిగులు విలువ సిద్ధాంతాన్ని, కార్మికుల శ్రమ దోపిడీని వివరించిన గొప్ప మేధావి కార్ల్ మార్క్స్ అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, రఫీ, ఇర్ఫాన్, మద్దిలేటి, మధు, ఖాజామియా పాల్గొన్నారు.

ఒంటి పూట బడులు నిర్వహించాలి

గోస్పాడు: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి భూమా రాజు సురేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించేవారన్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతున్నా ఒంటి పూట బడుల గురించి ఆలోచించకపోవడం తగదన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు కూడా వెంటనే అదనపు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు లక్ష తమలపాకుల అర్చన





పవన హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, లక్ష తమలపాకుల అర్చనలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో మంగళవారం అభయాంజేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, పవన హోమం తదితర పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లక్ష తమలపాకులు, సింధూరంతో అర్చన గావించారు. కార్యక్రమంలో అర్చకులు ప్రహ్లాద స్వామి, సుధీంద్రాచార్యులు, పవన్‌శర్మ, భగవత్ సేవా సమాజ్ సభ్యులు సముద్రాల సూరయ్య, మధుసూదనరావు, దేవరశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయని మున్సిపల్ అధికారులు

నంద్యాల(సిటీ): జిల్లా కలెక్టర్ ఆదేశాలను మున్సిపల్ అధికారులు గాలికొదిలేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని 15 రోజుల క్రితమే చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆదేశించారు. అయినా నగరంలో ఇప్పటికీ ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. అసలే ఎండలు మండిపోతున్నాయి. వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. ఇప్పటికైనా త్వరగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ పడినప్పుడు ఎండకు వేచి ఉండలేకపోతున్నామని చలువ పందిళ్లు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారుడితో ఉపాధ్యాయ బృందం

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాయిచరణ్ జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి సాయిచరణ్‌ను పీడీ దాదాపీర్, పీఈటీ భారతిలతో కలిసి హెచ్ఎం కోటయ్య అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 8న ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ కళాశాల ఆవరణలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 28 నుంచి చత్తీస్‌గడ్‌లో జరగనున్న జాతీయస్థాయి త్రో బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొననున్నట్లు చెప్పారు.

17న ఉరుసు

శిరివెళ్ల: మండల పరిధిలోని యర్రగుంట్లలో ఈ నెల 17న సయ్యద్ హజరత్ అలిషావలీ–ఇమాంషావలి స్వాముల వారి ఉరుసు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. 16న గంధం, 17న ఉరుసు, 18న జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నాయి. ఉరుసు సందర్భంగా 17న సేద్యపు ఎద్దుల బల ప్రదర్శన ఉంటుందని, గెలుపొందిన వృషభాల యజమానులకు 20 తులాల వెండి, ద్వితీయ బహుమతి 14 తులాలు, తృతీయ బహుమతి 8 తులాలు, నాలుగవ బహుమతి 6 తులాల వెండిని అందజేయనున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



బాలింతకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న నంద్యాల డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా

మిడుతూరు: ఆసుపత్రికి వచ్చే రోగులను ఆత్మీయ పలకరింపుతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ జఫరుల్లా అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 100 డెలివరీలు, 300 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తయిన సందర్భంగా సామాజిక ఆరోగ్యకేంద్రంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ హాస్పిటల్‌కు డెలివరీలకు వచ్చే రోగులకు సాధారణ కాన్పులు చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలను అందించాలని చెప్పారు. ఆశా కార్యకర్తలు సెల్‌ఫోన్ నంబర్లు పెట్టుకొని గర్భిణుల ఆరోగ్యం, యోగ, క్షేమాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలని సూచించారు. కాన్పుల సంఖ్య పెంచడంతోపాటు మాతాశిశుమరణాల రేటు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. నందికొట్కూరు, మిడుతూరు సీహెచ్‌సీ డాక్టర్లు సమన్వయంతో హై రిస్క్(సిజెరిన్), ఆపరేషన్లు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. హాస్పిటల్‌లో అందే సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిడుతూరు, నందికొట్కూరు సీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాయుడు, గైనకాలజిస్టు డాక్టర్ సుగుణ, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ ప్రసాద్ నాయక్, అనస్థీషియా డాక్టర్ శారద, డెంటిస్టు వీణా, వైద్యులు వంశీకృష్ణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం



విద్యార్థినికి మాత్ర వేస్తున్న వైద్యాధికారులు అంజలి, ఇమ్రాన్

ఆళ్లగడ్డ: పిల్లల్లో నులిపురుగులను పూర్తిగా నివారిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చాగలమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అంజలి, ఇమ్రాన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా చాగలమర్రి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులు అంజలి, ఇమ్రాన్‌లు విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈసురాధ, హెచ్ఎం విజయలక్ష్మి ఉన్నారు.

- **రుద్రవరం:** మండల కేంద్రమైన రుద్రవరం, నర్సాపురం పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు వైద్యులు శ్రావణి, బాబు, ఉపాధ్యాయ బృందం కలిసి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.
- **ఉయ్యాలవాడ:** నులిపురుగుల నివారణ కోసం మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ నూర్జహాన్, వైద్యాధికారి వెంకటసుబ్బయ్యలు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ఆల్బెండజోల్'తో జీర్ణకోశ వాధ్యులు దూరం

నంద్యాల(సిటీ): ఆల్బెండజోల్ మాత్ర వేసుకుంటే కడుపులోని నులిపురుగులు నశించి జీర్ణకోశ వాధ్యులు దూరమవుతాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి సూచించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగన్నతో కలిసి ఆమె విద్యార్థులకు ఆల్బెండోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 19 ఏళ్లలోపు ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగుల వల్ల జీర్ణకోశ, అనీమియా, ఎదుగుదల లోపం తదితర ఇబ్బందులతో చిన్నారులు బాధ పడతారన్నారు. నులిపురుగుల నివారణ కోసం 1 నుంచి 2 ఏళ్లలోపు వయస్సు పిల్లలకు 200 మిల్లీగ్రాముల ఆల్బెండజోల్ మాత్రలు, ఆ పైబడి వయస్సు కలిగిన పిల్లలకు 400 మిల్లీగ్రాములు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామలింగారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

- **గోస్పాడు:** నులి పురుగుల నివారణకు ఆరోగ్య సిబ్బంది ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నంద్యాల జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీని ఆయన పరిశీలించారు. ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది సలహా మేరకు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రుద్రవరం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న ప్రిన్సిపాల్ నూర్జహాన్



నంద్యాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తున్న దృశ్యం

మహానందిలో కన్నడిగుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో భక్తులసందడి

మహానంది: ఉగాది పర్వదినం సమీపిస్తుండటంతో మహానంది ఆలయ ప్రాంగణాలు కన్నడ భక్తులతో కళకళలాడుతున్నాయి. వేలాది సంఖ్యలో కన్నడిగుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. మంగళవారం రెండు తెలుగురాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటక రాష్ట్ర భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి ఏకాంత సేవ పూజల వరకు దర్శనం కొనసాగింది.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక నిర్వహించారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలను తీసుకువెళ్తున్న దేవస్థానం ఉద్యోగి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం భ్రమరాంబా అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం, శుక్రవారం ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి కుంభోత్సవ జరపడం సంప్రదాయం. ఈ ఏడాది ఏప్రిల్ 11న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాదికాలు జరిపించారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

గోస్పాడు: మద్దతు ధరతో ప్రభుత్వమే జొన్నలు కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.2,970 చొప్పున మండలంలో 1,830 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసే లక్ష్యంతో ఉన్నామన్నారు. జూలేపల్లె, పసురపాడు, ఎం.కృష్ణాపురం, గోస్పాడు, యాళ్లూరు, ఒంటివెలగల ఆర్‌బీకేలలో కొనుగోళ్లను ప్రారంభించి ఇప్పటికే 435 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ ప్రాసెసింగ్ చార్జీలకు క్వింటాకు మరో రూ.22 ఇస్తున్నట్లు చెప్పారు. రవాణా, సంచుల ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు.